క్లుప్తంగా

మల్లన్నను దర్శించుకున్న శిద్దా దంపతులు



వేద ఆశీర్వచనం అందజేస్తున్న ఆలయ వేదపండితులు, ప్రధాన అర్చకులు

ఒంగోలు: శ్రీశైలం భ్రమరాంబ మల్లిఖార్జున స్వామిని మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా దేవస్థానం ఈవో పెద్దిరాజు, చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి శిద్దా రాఘవరావు దంపతులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు మాజీమంత్రి శిద్దా దంపతులకు వేద ఆశీర్వచనంతో పాటు ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.



అగ్రహారంలోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న శిద్దా వెంకటేశ్వరరావు

చీమకుర్తి: అగ్రహారంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా పదోరోజు పౌర్ణమినాడు గోదాదేవి కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ కైంకర్యపోషకులు శిద్దా వెంకటేశ్వరరావు, స్థానిక భక్తులు గుర్రం దామోదర్, అర్చకులు శేషాచార్యులు, భక్తులు పూజా వేడుకలలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి



అలంకరణలో దత్తాత్రేయ స్వామి

ఒంగోలు మెట్రో: మార్గశిర పౌర్ణమిని దత్తాత్రేయ జయంతిగా జరుపుకుంటారు అని బ్రహ్మశ్రీ నేలబోట్ల సదాశివశాస్త్రి తెలిపారు. దత్త జయంతి సందర్భంగా నగరంలో సాయిబాబా మందిరాల్లో దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు హోమాలు నిర్వహించారు. స్థానిక లాయర్ పేట షిరిడి సాయిబాబా మందిరంలో, హౌసింగ్ బోర్డు, కర్నూల్ రోడ్, సంతపేట సాయిబాబా మందిరంలో దివ్య మంగళ దర్శనం కల్పించారు. సాయి కల్చరల్ మిషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిపించారు.

రంగాకు ఘన నివాళి



చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న నాయకులు

చీమకుర్తి: వంగవీటి రంగా వర్ధంతి సందర్భంగా కాపుసంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం చీమకుర్తిలోని పోలీస్ స్టేషన్, గాంధీనగర్, కంచుకోట బజారులో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. వైస్ ఎంపీపీ జ్యేష్ఠ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు బీమన వెంకట్రావు, పత్తి కోటేశ్వరరావు, తప్పెట బాబూరావు, ఆముదాలపల్లి రామబ్రహ్మం, పాలడుగు సుబ్బారావు, షేక్ ఖాదర్ బాషా, సూది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర ప్రారంభం



చీమకుర్తిలో జెండా ఊపి ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ప్రారంభించారు. 3,280 అడుగుల పొడవున రూపొందించిన జాతీయ జెండాతో క్రీడాకారులు గాంధీనగర్ నుంచి చీమకుర్తిలోని ప్రభుత్వ హైస్కూలు క్రీడా ప్రాంగణం వరకు చేపట్టిన ర్యాలీని వారు ప్రారంభించారు. అనంతరం క్రీడాప్రాంగణంలో క్రికెట్, వాలీబాల్ పోటీల్లో వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి పాల్గొని క్రీడాకారులకు ప్రోత్సాహమిచ్చారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, బాల్‌బ్యాడ్మింటన్‌లో చీమకుర్తి పట్టణంలోని 8 సచివాలయాల పరిధిలోని క్రీడాకారులు పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సీఈఓ జాలిరెడ్డి, కమిషనర్ షేక్ ఫజులుల్లా, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి పాల్గొన్నారు.

చీమకుర్తి: సంతనూతలపాడులోని 1, 2 సచివాలయాల పరిధిలోని క్రీడాకారులతో బస్టాండ్‌లో మండల స్పెషలాఫీసర్ ఉషారాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బి.వి జయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ స్థాయి నుంచి విజేతలకు బహుమతులను అందిస్తారని తెలిపారు.

మద్దిపాడు: ఇనమనమెళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిభ ఉండి వెలుగులోకి రాని క్రీడాకారులను గుర్తించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పని చేస్తున్నారన్నారు. సర్పంచ్ ఏకుల ఏడుకొండలు పాల్గొన్నారు. మద్దిపాడు కడియాల యానాదయ్య ఉన్నత పాఠశాలలో ఘడియపూడి సచివాలయ క్రీడా పోటీలను ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి ప్రారంభించి సర్పంచ్ రామాంజనేయులుతో కలిసి షటిల్ ఆడారు.

ఒంగోలు రూరల్: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదం చేస్తాయని ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లిఖార్జునరెడ్డి అన్నారు. ఒంగోలు తహసీల్దార్ పసుపులేటి మురళి ముఖ్య అతిథిగా పాల్గొనగా ఉలిచి, గుండాయపాలెం గ్రామాల్లో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను క్రీడా జెండా ప్రారంభించారు. ఈవోఆర్డీ మారెడ్డి, ఉలిచి కార్యదర్శి సురేష్‌కుమార్, సర్పంచ్ మంచు మురళి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆదిశేషయ్య, మదన్‌మోహన్, ప్రముఖ నాయకులు, జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం కోటేశ్వరరావు, వెటర్నరీ డాక్టర్ ప్రతిమారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గుండాయపాలెంలో..

ఎంపీపీ, తహసీల్దార్ ఈవోఆర్డీతో పాటు కార్యదర్శి ఆశీర్వాదం, సర్పంచ్, మండల వైస్ ఎంపీపీ అయ్యల వాణి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. దేవరంపాడులో సర్పంచ్ మహాలక్ష్మి నిర్వహించారు. కరవదిలో సర్పంచ్ కోటేశ్వరరావు, అధ్యక్షతన కార్యదర్శి నాగేంద్రబాబు, కార్యదర్శి-2 వేమా శ్రీలక్ష్మి ప్రారంభించారు. సర్వేరెడ్డిపాలెంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ భూపాల్‌రెడ్డి అధ్యక్షతన కార్యదర్శి భాగ్యలక్ష్మి క్రీడా పోటీలు నిర్వహించారు. యరజర్లలో సర్పంచ్ టి.రాములమ్మ, కార్యదర్శి రామకృష్ణ నిర్వహించారు. తమ్మిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొత్తపట్నం: క్రీడల్లో రాణిస్తే ఉన్నతమైన భవిష్యత్ ఉంటుందని జిల్లా అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ళ రవీంద్రరెడ్డి అన్నారు. ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య అధ్యక్షత వహించారు. మండల ప్రత్యేక అధికారి అర్చన, తహసీల్దార్ బీవీ రమణారావు మాట్లాడుతూ ఆటల్లో ప్రతిభ కనపర్చిన వ్యక్తికి మండల, జిల్లా స్థాయిల టీంలో ప్రవేశం ఉంటుందని చెప్పారు. ఎంఈవో-2 పద్మావతి, పీఈటీ సాయికిషోర్, పంచాయతీ కార్యదర్శి సునీత, అల్లెయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడం, వారి ప్రతిభకు తగిన గుర్తింపు కల్పించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ఈ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ఉత్సాహంగా నిర్వహించాలని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అమ్మనబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. నాగులుప్పలపాడులో ఏఎంసీ చైర్మన్ మారెళ్ళ బంగారుబాబు, ఎంపీడీవో జయమణి క్రీడలను ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఉప్పుగుండూరులో తహసీల్దార్ సుజన్ కుమార్, నాయకులు మాదాసు రాంబాబు, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు ప్రారంభించారు. లిడ్‌క్యాప్, హౌసింగ్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, కొలకలూరి విజయ్ కుమార్, సర్పంచ్‌లు రవీణ, మందా హెప్సీ రాణి, దేవరకొండ జయమ్మ, అశోక్, కాట్రగడ్డ శ్రీను, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారయణ, స్పెషల్ ఆఫీసర్ అంజల పాల్గొన్నారు.

ఒంగోలు టౌన్: ఆడుదాం ఆంధ్రలో చెరుకుపాలెం యువకులు సత్తా చాటాలని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. మంగళవారం చెరుకుంపాలెంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని యువకులను మంచి ప్రతిభ కలిగిన క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. మున్సిపల్ డీఈ పద్మజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఇనమనమెళ్లూరులో షటిల్ ఆడుతున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి



గుండాయపాలెంలో సర్వీసు చేస్తున్న ఎంపీపీ



చెరుకుంపాలెంలో ప్రారంభిస్తున్న మేయర్ సుజాత



చీమకుర్తిలో 3,280 అడుగుల పొడవు జాతీయ జెండాతో ర్యాలీ



సంతనూతలపాడులో మాట్లాడుతున్న దుంపా చెంచిరెడ్డి



వాలీబాల్ ఆడుతున్న మద్దిపాడు టీంలు



నాగులుప్పలపాడు లో క్రీడలను ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ మరేళ్ల బంగారు బాబు



కొత్తపట్నంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



ఈతముక్కలలో జెండా ఊపి ప్రారంభిస్తున్న రవీంద్రరెడ్డి, సచివాలయం సిబ్బంది



అమ్మనబ్రోలులో ప్రారంభిస్తున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి



క్రీడాకారులకు కిట్లు అందజేస్తున్న ఎంపీపీ

ఎయిడెడ్ సమస్యలపై విజ్ఞప్తి



ఏడీకి విజ్ఞప్తి చేస్తున్న ఏపీటీజీ నాయకులు

ఒంగోలు: ఎయిడెడ్ సమస్యలపై ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా నాయకులు మంగళవారం జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఉదయ్‌భాస్కర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు సంబంధించి జీవో నెంబర్ 50 ప్రకారం పీఎఫ్ అకౌంట్‌కు ఏ సెక్షన్ అధికారుల ద్వారా ప్రొసీడింగ్స్ విడుదల చేయాలని కోరారు. ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే తెలుగు, హిందీ పండిట్, పీఈటీలకు సంబంధించి పదోన్నతి రిపోర్టును ప్రభుత్వానికి పంపాలని కోరారు. కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి తదితరులున్నారు.

అక్రమాలపై విచారణ జరపాలి

ఒంగోలు అర్బన్: ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని కోరుతూ బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాటికలపూడి జయరామ్, మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షుడు సుజన్ మాదిగ మంగళవారం ప్రకాశం భవనంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎగ్జిస్టింగ్ ఖాళీల రోష్టర్ పాయింట్లు, భర్తీ కోసం ఎంపిక చేసిన రోష్టర్ పాయింట్లను పరిశీలించాలని కోరారు.

సాయిబాబా స్కూలులో అవగాహన సదస్సు



సాయిబాబా స్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

ఒంగోలు: స్థానిక సాయిబాబా సెంట్రల్ స్కూలులో బాలబాలికలకు అవగాహన సదస్సు మంగళవారం బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల గురించి వారికి వివరించారు. బాలబాలికల సమ్యలను ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. కౌమారదశలో ఉన్న బాలికలకు హెచ్‌బీ లెవల్స్ చెక్ చేయించాలని సచివాలయం సిబ్బందిని, ఎంఈవోను ఆదేశించారు. పిల్లలకు ఏవైనా సమస్యలు ఉంటే 1098 కి ఫోన్‌చేసి తెలపాలన్నారు. నీలిమ, ఎంఈవో 2 సరస్వతి, కరస్పాండెంట్ జీవీ భాస్కర్, ప్రిన్సిపాల్ ఎం.మహేష్, శశిలక్ష్మి పాల్గొన్నారు.

పొగాకు క్యూరింగ్ పరిశీలన



బోర్డు చైర్మన్‌కు పుష్పగుచ్ఛం మారెడ్డి సుబ్బారెడ్డి, సత్య శ్రీనివాస్ తదితరులు

మద్దిపాడు: వెల్లంపల్లి వేలం కేంద్రం పరిధిలోని బ్యారన్‌లలో క్యూరింగ్ అవుతున్న పొగాకును బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. పండుగుల్ల ఆకును వేలం కేంద్రంలో కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, బయట అమ్ముకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రపాడులో బ్యారన్‌లో క్యూరింగ్ అవుతున్న పొగాకును పరిశీలించారు. నిర్వహణాధికారి సత్యశ్రీనివాస్, వేలం కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కాశినాయన ఆరాధన

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టు సమీపంలో వెలసిన సమర్థ సద్గురు శ్రీ కాశినాయన 28వ ఆరాధన మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలమాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు బీవీ దత్తయ్య ఆధ్వర్యంలో స్వామి వారికి సుప్రభాతసేవ చేశారు. భక్తుల కోసం తోకపల్లి యోగానంద లక్ష్మీనరసింహస్వామి భక్తమండలి వారిచే భక్తి పాటల భజన, సాయంత్రం కోలాట ప్రదర్శన, కోడి శ్రీరామమూర్తి ఆరోగ్య క్రీడాభివృద్ధి సంస్థ వారిచే కర్రసాము ప్రదర్శన, రాత్రి శ్రీభక్త చింతామణి పూర్తి నాటకం ప్రదర్శించారు.

ప్రతిభ విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న శ్రీప్రతిభ విద్యాసంస్థల సీఈవో జయప్రకాష్ నారాయణ

ఒంగోలు: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని సత్తాచాటిన విద్యార్థులను శ్రీప్రతిభ కాలేజీ కాలేజీ చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, సీఈవో జయప్రకాష్ నారాయణ మంగళవారం అభినందించారు. విశాఖలో ఈనెల 23,24 తేదీల్లో జరిగిన ఆల్ ఇండియా 21వ ఫెడరేషన్ కప్‌లో పాల్గొని విజయంతో తిరిగి వచ్చిన విద్యార్థులకు శ్రీగురుదత్త విద్యాసంస్థలో అభినందన కార్యక్రమం జరిగింది. కోచ్ నల్లూరి మోహన్‌రావు మాట్లాడుతూ 15 సంవత్సరాల కటా విభాగంలో యం.మణికంఠ బంగారు, 16 సంవత్సరాల 57 కేజీల కుమితే విభాగంలో ఎస్‌కే అబ్దుల్ కబీర్ సిల్వర్ మెడల్ సాధించార్నారు. 14 సంవత్సరాల 58 కేజీల విభాగం

మిరప సాగుపై అప్రమత్తం



సలహాలు ఇస్తున్న ఉద్యానవన అధికారులు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో మిరప సాగు చేసే రైతులను నిత్యం అప్రమత్తం చేస్తున్నామని జిల్లా ఉద్యానవశాఖాధికారి వైఎంఎస్‌ఎస్ గోపిచంద్ అన్నారు. మంగళవారం మాట్లాడుతూ జిల్లాలో 84,900 ఎకరాలలో సుమారు మిర్చి సాగు చేస్తున్నారని, జిల్లాలో పది మంది ఉద్యాన విస్తరణ అధికారులు , గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులు ద్వారా ఉద్యానశాఖ మిరప రైతులకు నిరంతరం సలహాలు తగు సూచనలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉద్యానవర్సిటీ నుంచి శాస్త్రవేత్తలచే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మిచాంగ్ తుఫాన్ తరువాత అధిక వర్షాల సమయంలో మిరప పంటలో సమయాను కూలంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించామని చెప్పారు.

క్రైస్తవ పాటల పోటీలు

కొత్తపట్నం: నూతన సంవత్సర పురస్కరించుకుని మండల స్థాయిలో ఎస్‌డీఏ చర్చివారి ఆధ్వర్యంలో ఆకుల అల్లూరు గ్రామంలో ఈ నెల 28న క్రైస్తవ పాటల పోటీలు నిర్వహించనున్నట్లు సీనియర్ కళాకారుడు, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు తెలిపారు. ఈ నెల 28 సాయంత్రం 7 గంటలకు పారంభమవుతాయన్నారు. మొదటి బహుమతి రూ.5 వేలు, రెండో బహుమతి 3 వేలు, మూడో బహుమతి 2 వేలు, నాలుగో బహుమతి రూ.1,500 ఇస్తామన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

మార్కాపురం: దివతంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరిచిపోలేని మహానేత అని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మార్కాపురం పాత బస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్‌తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్సార్.. వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నగేష్, సిరాజ్, కొత్త కృష్ణ, రోజ్‌లిడియా, చాటికొండ చంద్రశేఖర్, వార్డు ఇన్‌చార్జి ఉత్తమ్‌కుమార్, షెక్షావలి, పార్టీ ప్రధాన కార్యదర్శులు పత్తి రవిచంద్ర, శేషయ్య పాల్గొన్నారు.

జై జవాన్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల రోడ్డు మానసిక వికలాంగుల పాఠశాల ఆవరణలో మంగళవారం స్థానిక మాజీ సైనికులు, ఆర్మీ ఉద్యోగులు కలిసి జై జవాన్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆర్మీలో విధులు నిర్వహిస్తున్న బీఎస్‌రెడ్డి, జాకీర్ హుస్సేన్‌ల ప్రోత్సాహంతో జై జవాన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్నట్లు మాజీ సైనికుల సంఘ నాయకులు అంకన్న తెలిపారు. జవాన్లలో ఐక్యత పెంపొందించేందుకు ఈ క్యాలెండర్ ఆవిష్కరణ దోహదపడుతుందన్నారు. మాజీ సైనికుల సంఘ నాయకులు రాధామోహన్, వేణుగోపాల్, దేవసాయం, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ నారాయణరెడ్డి, గురువారెడ్డి పాల్గొన్నారు.

అందరినీ ప్రేమించడమే సాయితత్వం

మార్కాపురం: సమాజంలో ప్రతి ఒక్కరినీ ప్రేమించడం, అన్ని జీవుల్లో భగవంతుడిని చూడడమే సాయితత్వమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, సాయి ఉపాసకులు మైనంపాటి ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం నెహ్రూబజారులోని సాయిబాబా మందిరంలో ప్రవచనం చేశారు. మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు ఆధ్వర్యంలో ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. మంగళవారం దత్తజయంతిని పురస్కరించుకుని బాబా మందిరంలో 108 మంది మహిళా భక్తులతో కలశపూజ చేశారు.

అసైన్డ్ హక్కుల కల్పనలో స్పష్టత ఉండాలి

తర్లుపాడు: అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించే విషయంలో రెవెన్యూ యంత్రాంగం స్పష్టంగా ఉండాలని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా పేర్కొన్నారు. మంగళవారం తర్లుపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులు అందుబాటులో లేవనే కారణంతో అసైన్డ్ రైతులకు యాజమాన్య హక్కులను నిరాకరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సబ్‌కలెక్టర్‌కు తహసీల్దార్ అబ్దుల్ హమీద్, డీటీ ఖలీల్ స్వాగతం పలికారు. ముందుగా జేసీ శ్రీనివాసులుతో కలిసి స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆడుదాం ఆంధ్రా పోటీలను సబ్ కలెక్టర్ పర్యవేక్షించారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు

మార్కాపురం టౌన్: మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాను మంగళవారం రాత్రి ఆయన చాంబర్‌లో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, ఏఎంసీ మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, ఎస్వీకే నిలయం అధ్యక్షుడు డాక్టర్ ఇమ్మడి బాలసుబ్బారావు, కమిటీ సభ్యులు, పత్తి రవిచంద్ర, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

యువకుడు అదృశ్యంపై కేసు



చీరాల: యువకుడు అదృశ్యంపై ఈపూరుపాలెం రూరల్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్సై జనార్దన్ వివరాల మేరకు.. ఈపూరుపాలెం గ్రామానికి చెందిన తిరువీధుల ప్రసాద్ గ్రామంలోని ఓ హ్యాండ్లూమ్స్‌లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఇటీవల అతడు అనారోగ్యానికి గురయ్యాడు. అయితే ఈనెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు అన్ని ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసును నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కబడ్డీ క్రీడాకారులకు అభినందనలు

కొనకనమిట్ల: బాపట్ల జిల్లా చినగంజాం మండలం సంతరావూరులో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో గొట్లగట్టు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, పాఠశాల పీడీ ఎం.బాలగురవయ్య మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులు సీహెచ్ మహేశ్వరి, ఎం.శ్రీలత, ఆర్.కల్పన ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. రగ్బీ పోటీల్లోనూ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని చెప్పారు.

నేడు మార్కండేశ్వరుని ఉత్తరద్వార దర్శనం

మార్కాపురం టౌన్: మార్గశిరమాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని మార్కండేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి ఉత్తర ద్వారా దర్శనం ఏర్పాటు చేసినట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి, చైర్మన్ కేశవశర్మ తెలిపారు. వైకుంఠ ఏకాదశి తరువాత వచ్చే మొదటి నెల ఆరుద్ర నక్షత్రాన్ని పురష్కరించుకుని మహాశివుని ఉత్తర ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం

పొదిలి: రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు గెలిపించడమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పని చేయాలని ఆ పార్టీ పొదిలి పట్టణ కన్వీనర్ నూర్జహాన్ కోరారు. సోమవారం రాత్రి పందిటి రవీంద్రబాబు, ప్రకాశ్‌నగర్ యూత్ ఆధ్వర్యంలో నూర్జహాన్, మస్తాన్‌వలి దంపతులను ఘనంగా సన్మానించారు. పార్టీ జిల్లా కార్యవర్గానికి ఎంపికైన పందిటి రవీంద్రబాబు మాట్లాడుతూ.. క్రిస్మస్ పండుగను ఉత్సాహంగా నిర్వహించుకోవడానికి నూర్జహాన్ సహకారం అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకాశ్‌నగర్ నూర్జహాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.